# డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రాంతంలో సమస్యలను పరిష్కరించాలి



**కూసుమంచి, మహా:** మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివసిస్తున్న ప్రజల పరిస్థితి దారుణంగా ఉందని, వెంటనే ఆ ప్రాంతంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ని డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ బాధితులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి క్యాంప్ కార్యాలయం పక్కనే ఉన్న కూడా డబుల్ బెడ్ రూమ్ ప్రజలను పట్టించుకోవడం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తుందని విమర్శించారు.వర్షం వస్తే సీసీ రోడ్లు లేక, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీటితో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం. మంచినీటి సౌకర్యం కూడా లేదన్నారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ నిరంతరం వాటర్ సరఫరా కావడం లేదని ,వారానికి ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా అవుతుందని తెలిపారు. రాత్రి వేళల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వెళ్లాలంటే సరిగ్గా వీధిలైట్లు కూడా లేవని ఆరోపించారు.వీధిలైట్లు సరిగ్గా లేక ఇండ్లలోకి పాములు, తేళ్లు, ఇతర కీటకాలు ఇళ్లల్లోకి వచ్చి ఈ పరిస్థితుల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ లో సమస్యలను పరిష్కారం అయ్యేవరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, మండల కమిటీ సభ్యులు గోపి వెంకన్న, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి నెల్లూరి వెంగళరావు, గ్రామ నాయకులు మీసాల వెంకటేశ్వర్లు, కొక్కిరేణి వెంకన్న, నలగాటి బాలయ్య,చావా వెంకటేశ్వర్లు, మందా నాగేశ్వరరావు, కొక్కిరేణి గురవయ్య, వేము రమేష్, సోషల్ మీడియా ఇంచార్జ్ కార్తీక్, డబల్ బెడ్ రూమ్ బాధితులు పాల్గొన్నారు

# తిప్పలు తప్పని ప్రయాణం

**జూలూరుపాడు, ఆగస్టు 22, (మహా):** ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే తిప్పలు తప్పవు ఎటు చూసినా గుంటలే, ఎక్కడ ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని మండల కేంద్రానికి చేరాల్సిన పరిస్థితి ప్రజలకు ఏర్పడింది. ఇది ప్రస్తుతం పాపకొల్లు, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ సమస్య. జూలూరుపాడు నుండి పాపకొల్లు వరకు రోడ్డు వెడల్పు లో భాగంగా ఉన్న తారు రోడ్డును తొలగించి కొంతమేర రోడ్డు పోసి మిగతాది గ్రావెల్ వర్క్ చేసి వదిలేశారు. దీంతో వర్షాల కారణంగా రోడ్డు అస్తవ్యస్తంగా మారి గుంటల్లో నీరు నిలిచి ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఈ రోడ్డు వెంట నిత్యం సుమారు 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ప్రయాణం చేసి మండల కేంద్రానికి వచ్చిపోతూ ఉంటారు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు దారుణమైన దయానియ పరిస్థితిలో ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని అధికారులను, నాయకులను ప్రజలు కోరుతున్నారు.



# ఎర్రజెండా సారథి కూనంనేని

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాజకీయాల్లో వామపక్ష ఉద్యమాల అగ్ని ఎప్పటికీ ఆరిపోదు. ఆ అగ్ని మంటలను మరింత వేడెక్కిస్తూ, శ్రామిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు సారథ్యం వహిస్తూ, ఎర్రజెండా గౌరవాన్ని ప్రజల గుండెల్లో నిలిపిన నాయకుడు కునంనేని సాంబశివరావు. ఒక సాధారణ విలేకరి జీవితంతో మొదలై, మార్క్సిజం%-%లెనినిజం సిద్ధాంతాలను పాఠ్యపుస్తకాలలోనే కాక, ప్రజా ఉద్యమాలలో ఆయుధాలుగా మలచి చూపిన విప్లవ సైనికుడు. అరెస్టులు, అణచివేతలు, నిర్బంధాలు ఎదురైనా ఆయన వెనకడుగు వేయలేదు. 2022లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై, మూడు సంవత్సరాల్లో పార్టీకి కొత్త శక్తి, ఉత్సాహం నింపిన ఆయన, 2025లో మేడ్చల్ జిల్లా గాజులరామవరం లో జరిగిన నాలుగో మహాసభలో రెండోసారి అదే పదవికి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయనకున్న ప్రజా విశ్వాసం, పార్టీపై ఉన్న నిబద్ధతకు ప్రత్యక్ష నిదర్శనం. రైతు, కూలీ, కార్మికుల పక్షాన అగ్నిజ్వాలగా మండే కమ్యూనిస్టు దీప్తి ఆయన జీవితం అంతా ప్రతిబింబిస్తుంది.



**సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి.**

సాంబశివరావు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రెండు దఫాలు సేవలందించి, 2022లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగిన మూడవ మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడు సంవత్సరాల్లో ప్రజా ఉద్యమాలకు పునర్వైభవం తీసుకువచ్చి, జిల్లాల వారీగా పార్టీని విస్తరించారు. ధర్నాలు, మహాధర్నాలు, రహదారి ఆందోళనలతో ప్రజా సమస్యలను ప్రథమ క్షేత్రంలో నిలిపారు. తాజాగా, 2025లో మేడ్చల్ జిల్లా గాజుల రామవరం లో జరిగిన నాలుగో మహాసభలో ఆయన మళ్లీ ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో మహమ్మద్ మౌలానా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా తిరిగి ఎన్నికయ్యారు.

## కొత్తగూడెం ఎర్రజెండా సారథి

గుంటూరు జిల్లాలో జన్మించిన కునంనేని సాంబశివరావు, తిరుపతిలో ప్రాథమిక విద్య పూర్తి చేసి, గుంటూరులో డిగ్రీ చదివారు. ఉద్యోగ జీవితాన్ని విశాలాంధ్రలో ఎడిటర్‌గా ప్రారంభించి, తరువాత హైదరాబాదు నుంచి కొత్తగూడెం పట్టణానికి ఆ పత్రిక విలేకరిగా వచ్చారు. కానీ ఆయన జీవితం జర్నలిజం కంటే పెద్ద లక్ష్యం కలిగింది ౨ ప్రజా ఉద్యమాలకు సైనికుడిగా నిలవడం. విలేకరితనం నుంచి ఉద్యమకార్యకలాపాలకు మలుపు తిరిగి, సీపీఐలో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. పార్టీ పట్టణ కార్యదర్శిగా ఎన్నికై, 1987లో మండల పరిషత్ అధ్యక్షుడిగా కొత్తగూడెం ప్రజలు ఆయనకు అద్భుత విశ్వాసం చూపారు. తరువాత డివిజన్ పార్టీ కార్యదర్శిగా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆయన పోరాటాలకు మరింత బలం చేకూరింది.

## రైతు-కూలీల గళం

2004 నుంచి 2009 వరకు సిపిఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, రైతు-కూలీల సమస్యలను సూటిగా పట్టుకొని పోరాటాలకు దారితీశారు. 2009లో శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, శాసనసభలో ఎర్రజెండా స్వరంగా నిలిచారు. రైతుల మద్దతు ధరలు, కూలీల కనీస వేతనాలు, కార్మికుల హక్కుల కోసం చేసిన ఆయన ప్రసంగాలు ప్రజాస్వామ్యంలో కమ్యూనిజం స్వరాన్ని ప్రతిధ్వనింపజేశాయి. పాలక వర్గాల విధానాలను ధైర్యంగా సవాల్ చేస్తూ, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిన ఆయన ప్రజల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు.

## ప్రజా ఉద్యమాల వేదికపై విజయగాథ

2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి సిపిఐ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిచి, ప్రజలకు కమ్యూనిజం శక్తిని మరలా చూపించారు. మంచివక్తగా, ఆందోళన కారుడిగా సాంబశివరావు పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆయన పోరాటాలు కేవలం రాజకీయ పరిమితుల్లోనే కాకుండా, ప్రజా హక్కుల కోసం విప్లవ దీపికలుగా మారాయి.

## శాశ్వత విప్లవ సైనికుడు

నిరాడంబర జీవన శైలి, సిద్ధాంతాలపై అచంచలమైన నమ్మకం, శ్రామిక వర్గాల పట్ల అపారమైన నిబద్ధత ౨ ఇవన్నీ కునంనేనిని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయి. అరెస్టులు, అణచివేతలు ఆయనను కుదిపివేయలేకపోయాయి. "ఎర్రజెండా రక్తంతో పుట్టింది, శ్రమతో నిలుస్తుంది, విప్లవంతో వికసిస్తుంది" అన్న నమ్మకాన్ని ఆయన ప్రస్థానం ప్రతిబింబిస్తోంది. భవిష్యత్ తరాలకు ఆయన జీవితం ప్రజా విముక్తి మార్గంలో కమ్యూనిస్టు దీపస్తంభంగా నిలిచిపోతుంది.

# సీఎంఆర్ఎఫ్ చెక్‌ల పంపిణి... ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

**కారేపల్లి, మహా :** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సిఫార్స్‌తో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్‌లను గురువారం కాంగ్రెస్ నాయకులు పంపిణి చేశారు. కారేపల్లిలో జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు చెక్‌లను అందజేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్‌మనియార్, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోనీ) మాట్లాడుతూ పేదలకు ఏ ఆపదవచ్చినా నేనున్నాంటూ ఎమ్మెల్యే అభయ హస్తం అందిస్తున్నారన్నారు. అనంతరం కారేపల్లిలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు పొలగాని శ్రీనివాస్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు తాజుద్దీన్, నాయకులు తురక రవి, ఎండీ హనీఫ్ పాల్గొన్నారు

